రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అర్జున్ ఎంపిక



పూడూరు, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పూడూరు మండల విద్యార్థి ఎంపియ్యాడు. ఎన్కెపల్లి గ్రామానికి చెందిన అర్జున్ తెలంగాణ మోడల్‌స్కూల్‌లో సీఈసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల జరిగిన అండర్-19 విభాగంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

బంగారం దొంగ.. మేనేజరే

- వికారాబాద్‌లోని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్‌లో ఘటన
- 63 ప్యాకెట్లలో 2.600 కిలోల బంగారం
- దాని విలువ రూ. 2.10 కోట్లు
- ఈనెల 18 నుంచి విధులకు రాని బ్యాంకు మేనేజర్
- ఆంధ్రజ్యోతి కథనంతో అప్రమత్తమైన బాధితులు

7



బాధితులతో మాట్లాడుతున్న సీఐ భీమ్‌కుమార్



బతుకమ్మలతో సీపీఎం నేతల ర్యాలీ

ఎరుపెక్కిన తాండూరు

- ఘనంగా సీపీఎం జిల్లా మహాసభలు ప్రారంభం
- నాయకుల భారీ ర్యాలీ
- పెట్టుబడి దారులను ప్రోత్సహిస్తున్న మోదీ
- జాన్ వెస్లీ

- వివరాలు 7లో..

బైక్‌కు డబ్బులు ఇవ్వలేదని..

- నానమ్మ తలను గోడకేసి బాది చంపిన మనువడు
- అక్కడికక్కడే మృతి చెందిన బాలమ్మ
- మేడ్చల్ మండలం రావల్‌కోల్‌లో ఘటన



డబ్బులు అవసరం ఉన్నప్పుడల్లా నానమ్మతో గొడవ పడి చేతి కందినంత తీసుకునేవాడు. కొద్ది రోజులుగా బైక్ ఇప్పించాలని తరచూ ఆమెతో గొడవ పడుతున్నాడు. ససేమిరా అనడంతో కోపంతో నానమ్మను చంపేశాడు మనవడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది.

7

అభ్యర్థులకు ఇబ్బంది కలిగించొద్దు



హితం కాలేజీలో ఏర్పాట్లను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్‌ప్రతినిధి, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి) : గ్రూప్ -1 మెయిన్ పరీక్షల నిర్వహణలో భాగంగా మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని పరీక్షా కేంద్రాలను శనివారం జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీకాలేజీ, మేడ్చల్‌లోని గౌడవెల్లి బాసిరేగడలోని హితం కాలేజీ, దూలపల్లిలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కాలేజీలను ఆమె పరిశీలించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

పత్తిపంట పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో కొమురయ్య

తాండూరు రూరల్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిధిలో ఎర్రబారుతున్న పత్తిపంటను శనివారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. అధిక వర్షాలతో 'ఎర్రబారుతున్న పత్తి, ఆందోళనలో రైతులు' అని శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి ఆదేశాల మేరకు ఏవో కొమురయ్య ఏఈవో శ్రీనివాస్, లక్ష్మణ్‌లు అల్లాపూర్, మల్కాపూర్, చెంగోల్, పర్వతాపూర్ గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు. పంట ఎర్రబారకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలిపారు.

కందిపంటను పరిశీలిస్తున్న విజయనిర్మల



Sunday Special

ఆమె మొదట సాధారణ గృహిణి. వ్యవసాయం, పొలం పనులపై ఉన్న ఆసక్తితో ఆధునిక పద్ధతులతో సాగును ప్రారంభించింది. కందిలో నూతన వంగడాలను వినియోగించి అనూహ్యమైన దిగుబడిని సాధించి ఔరా అనిపించారు. ఆమె ప్రతిభ, ఆసక్తిని గమనించిన ఇక్రిశాట్ రాష్ట్రస్థాయి ఉత్తమ మహిళా రైతుగా సత్కరించింది. పాత తాండూరుకు చెందిన మహిళా రైతు గాండ్ల విజయనిర్మల సాగు ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

సాగులో విజయం

వినూత్న పద్ధతులతో సాగులో దూసుకెళ్తున్న విజయనిర్మల

- 2014లో ఉత్తమ మహిళా రైతు అవార్డు గ్రహీత
- నాలుగెకరాల విస్తీర్ణంలో డ్రిప్ విధానంలో కంది సాగు
- భర్త నర్సింహులు సహకారంతో సాగులో ముందుకు
- ఆదర్శరైతు అంటున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

తాండూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత తాండూరుకు చెందిన గాండ్ల విజయనిర్మలకు వ్యవసాయంపై పెద్దగా అవగాహన లేనప్పటికీ ఆమెకున్న ఆసక్తితో ఆధునిక సాగుపై దృష్టి పెట్టింది. ఎప్పటికప్పుడు తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ఆదాయాన్ని ఇచ్చే పంట సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు. కంది, జొన్న, సజ్జ, శనగ పంటలతోపాటు కూరగాయల్లో నూతన వంగడాలతో అధిక దిగుబడి సాధిస్తోంది. సాగు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలోనూ అధిక దిగుబడి సాధించింది. విజయనిర్మలకు 2014 సెప్టెంబర్ 12న ఇక్రిశాట్ జాతీయ ఉమెన్స్ ఫార్మర్స్ డే-2014 సందర్భంగా ఉత్తమ మహిళా రైతుగా గుర్తించి ఇక్రిశాట్ డైరెక్టర్ విలియం డి.థర్ అవార్డు అందజేశారు.

కందిసాగులో లాభాలు

రాష్ట్రంలోనే కంది పంటను మొదటిసారి డ్రిప్ కింద సాగు చేసి అద్భుత ఫలితాలు సాధించారు. కందిలో డ్రిప్ సిస్టమ్‌తో నారు నాటి కొత్త పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడి సాధించింది. హైబ్రిడ్ విత్తనాలతో ఎకరాకు 4 క్వింటాళ్లకు బదులు 12 క్వింటాళ్లకు దిగుబడిని పెంచింది. కందితోపాటు జొన్న, కుసుమ, పెసర పంటలను సాగు చేసింది.

టాంజానియా కందిలో నూతన పద్ధతి

విజయనిర్మల తన వ్యవసాయ క్షేత్రంలో టాంజానియా కందిలో నూతన పద్ధతిలో ప్రయోగాత్మకంగా సాగు చేసింది. ఈ సాగును తాండూరు వాసులే కాకుండా ఆఫ్రికా, టాంజనియా దేశ శాస్త్రవేత్తలు కూడా ఆమె పొలానికి వచ్చి పరిశీలించారు. టాంజానియా వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ ఫిలోమాన్‌మోసి కూడా ఈ సాగును చూసి విజయనిర్మలను అభినందించారు. ఈ నూతన పద్ధతి కందిసాగులో ఎకరాకు 20క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించడం గమనార్హం.

నాలుగు ఎకరాల భూమితోనే సాగు

గాండ్ల విజయనిర్మల భర్త నర్సింహులు సహకారంతో డ్రిప్ పద్ధతిలో టమాట, వంకాయ, ఉల్లిగడ్డ, ఆకు కూరలు సాగు చేస్తున్నారు. ఇంటి పనులు చేస్తూనే అధిక సమయంలో పొలం పనులకు కేటాయిస్తుంది. విజయ నిర్మలకు ఇద్దరు

- మిగతా 8వ పేజీలో...

ప్రపంచానికి భారత్ శాంతి సందేశం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి) : ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన దేశం భారత్ అని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత సమీభావ సంఘం ప్రథమ మహాసభలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రపంచ శాంతి ఉద్యమంలో తాను భాగస్వామిగా ఉంటానని పేర్కొంటూ ఏబీఎస్‌వోలో సభ్యత్వం తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. బుద్ధుడు, మహాత్మాగాంధీల శాంతి సందేశం ప్రపంచానికి మార్గదర్శనమన్నారు. గ్లోబలైజేషన్ జరిగిన తరువాత ప్రపంచంలో ఏమూల యుద్ధం జరిగినా ఆప్రభావం ప్రపంచమంతటా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఒబేదుల్లా కోత్వాల్, మంజుల రమేష్, యాదవరెడ్డి, దిడ్డి సుధాకర్, కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 17,500 కేసులు పెండింగ్

న్యాయ విజ్ఞాన సదస్సులకు కార్యదర్శి నియామకం



కోర్టు ఆవరణను పరిశీలిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 17,500 కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శనివారం తాండూరు మున్సిఫ్ కోర్టును పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ప్రజలకు సత్వరం న్యాయం అందించేందుకు ప్రతి నెల న్యాయ విజ్ఞాన సదస్సుల నిర్వహణ కోసం కార్యదర్శిని నియమించినట్లు చెప్పారు. మండలాల వారీగా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. లోక్‌అదాలత్‌ల ద్వారా రాజీమార్గంతో 3500 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. హైకోర్టు అనుమతితో తాండూరుకు అదనపు కోర్టు మంజూరైందని సబ్ కోర్టు ప్రభుత్వ పరిశీలనలో ఉందని చెప్పారు. న్యాయమూర్తి వెంట చంద్రకిషోర్, శివలీల ఉన్నారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డిని తాండూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అగ్గనూరు శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులుతదితరులు సన్మానించారు.



యువ టూరిజం

ప్రభుత్వ పాఠశాలల్లో పర్యాటక క్లబ్బులు

- విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన
- ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఏర్పాటు

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పర్యాటక క్లబ్బులు ఏర్పాటుకు విద్యాశాఖ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. చారిత్రక అంశాలను, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు, విద్యార్థులకు పర్యాటకంపై అవగాహన కల్పించాలన్న సర్కారు ఆదేశాల నేపథ్యంలో విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో పర్యాటక క్లబ్బులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నది. జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలల్లో 96,284 మంది విద్యార్థులున్నారు. యువ టూరిజం పేరిట పాఠశాలల్లో క్లబ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో వీటిని నిర్వహించనున్నారు.

క్లబ్ ఏర్పాటు ఇలా..

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 7వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఉన్న చోట క్లబ్‌లలో సభ్యులుగా చేర్చుతారు. ఒక్కో క్లబ్‌కు ఒక విద్యార్థి బాధ్యత వహించనుండగా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా నాయకత్వం వహిస్తారు. బడుల్లో ఆన్‌లైన్ ద్వారా సంబంధిత వైటీసీ.టూరిజంగౌట్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా తమ బడుల వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటోంది. పర్యాటక క్లబ్ ద్వారా తెలంగాణ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయనున్నారు. విద్యార్థులతో తమ ప్రాంత పర్యాటక స్థలాలపై విస్తృత ప్రచారం చేయడానికి ఈ క్లబ్‌లు దోహదపడనున్నాయి.

చారిత్రక అంశాలపై అవగాహన

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు చారిత్రక అంశాలపై పట్టు పెంచేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టనున్నట్లు విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. పర్యాటక క్లబ్‌లు ఏర్పాటు చేసి దర్శనీయ స్థలాల సందర్శన చేయిస్తారు. సొంత ప్రాంతాల్లో ఉన్న చారిత్రక సంపదపై అవగాహన కల్పించేలా అన్ని విధాలుగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

బండలపై బెండ సాగు

సాగులో వినూత్న ఆలోచన
బండలపై మట్టిని పేర్చి బెండతోట
ఆదర్శంగా నిలుస్తున్న రైతు శేఖర్

ఆదిభట్ల మున్సిపాలిటీకి చెందిన ఓ రైతు వినూత్నంగా బెండ సాగు చేపట్టి ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆదిభట్ల నుంచి కొంగరకలాన్ వెళ్లే దారిలో తనకున్న అరెకరం భూమిలో వేసిన బెండ తోట దారిన పోయే వారిని ఎంతగానో ఆకట్టుకుంటుంది. సదరు రైతు చేసిన ఆలోచనకు గ్రామస్తులు మెచ్చుకోకుండా ఉండలేక పోతున్నారు. అరెకరం పొలంలో వెసిన బెండ తోటకు ఇంత బిల్డప్ అవసరమా? అని అనుకుంటున్నారా? అతను ఏం చేశాడో ఈ కథనంలో తెలుసుకుందాం.

ఆదిభట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి)

7



బండరాళ్లతో నింపిన గుంతపై సాగు చేసిన బెండ తోట

నిధుల వరద!

- కొడంగల్ అభివృద్ధికి మరో రూ. 43.75 కోట్లు
- పాఠశాలలు, అంగన్‌వాడీల అభివృద్ధికి వ్యయం



కొనసాగుతున్న ఆస్పత్రి పనులు

కొడంగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వెనకబాటుకు గురైన కొడంగల్ ప్రాంత అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కడా ఏర్పాటు చేసి భారీ నిధులు విడుదల చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీలు ఇతరాత్ర అభివృద్ధి పనుల కోసం రూ.60 కోట్లకుపైగా విడుదల చేశారు. అన్నీ విధాలుగా అభివృద్ధిలో వెనకబాటుకు గురైన కొడంగల్ నుంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో అందరి దృష్టి కొడంగల్‌పై పడింది. సీఎం సొంత నియోజకవర్గం కావడంతో కడాఏర్పాటుతో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. కొడంగల్ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రణాళికలు రూపొందించారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి మొదటి విడతగా రూ.120 కోట్లు అవసరం ఉన్నట్లు అధికారులు నివేదికలు పంపగా, ముందుగా రూ.15 కోట్లు విడుదల చేశారు. తాజాగా శుక్రవారం మరో రూ.43 కోట్ల75లక్షలు విడుదల చేసింది. మొత్తం రూ.60 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి పనులు వేగవంతం కానున్నట్లు తెలుస్తుంది. మంజూరైన నిధులతో ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. సీఎం నియోజకవర్గం కొడంగల్‌లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు ఇతరాత్ర ప్రధాన అభివృద్ధి పనుల కోసం పెద్ద పీఠ వేయనున్నారు. నియోజకవర్గంలోని అన్నీ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలఏర్పాటు, మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన చోట పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీనిర్మాణాలు ఇతరాత్ర సదుపాయాల కల్పించనున్నారు. అంగన్‌వాడీలకు నూతన భవన నిర్మాణాలను చేపట్టనున్నారు.

దుద్యాల్‌లో మండల కాంప్లెక్స్ ఏర్పాటు

నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఏర్పడిన దుద్యాల మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మండల కాంప్లెక్స్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోనే మోడల్‌గా ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో ఎంపీడీవో, తహసీల్దార్ తదితర శాఖల అధికారులు ఒకే దగ్గర ఉండే విధంగా కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారు. దీనికి దాదాపు రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలుస్తుంది. దశల వారీగా నియోజకవర్గఅభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిరుత కలకలం!



ఆరా తీస్తున్న అధికారులు

పరిగి/కొడంగల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గడిసింగాపూర్ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామ సమీపంలో చిరుత ఆనవాళ్లు కనిపించడంతో స్థానికులు పరిగి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న వారు జంతువు పాదముద్రలను పరిశీలించి అవి కుక్కలవిగా గుర్తించినట్లు ఫారెస్ట్ అధికారి ప్రతిమ తెలిపారు. కాగా, చిరుతపులి సంచరిస్తుందనే సమాచారంతో అటవీ అధికారులు, సిబ్బందితో కలిసి కొడంగల్ మండలం పోచమ్మకుంట తండా శివారులోని పంటపొలాల్లో పాదముద్రలను పరిశీలించారు. పాదముద్రల నిర్ధారణకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల కొరత

వికారాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన మందులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం వికారాబాద్ ప్రాంతానికి చెందిన మోహన్ జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులతో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ వైద్యులు పరీక్షించిచి మందులు రాసి ఇచ్చారు. ఆస్పత్రిలో మందులు ఇచ్చే కౌంటర్ వద్దకు వెళ్లగా జ్వరం మందు ఇచ్చి మిగితా మందులు బయట కొనుక్కోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నారు.

విద్యార్థులకు జెర్సీల అందజేత



జెర్సీలు ధరించిన విద్యార్థులతో ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ షాద్‌నగర్ జోన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జెర్సీలను అందజేశారు. ఆదివారం తుక్కుగూడ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఖోఖో పోటీలు నిర్వహిస్తారు. ఈ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు శనివారం క్యాంప్ కార్యాలయంలో ఎంఈవో మనోహర్‌తో కలిసి క్రీడా దుస్తులను అందించారు. వారికి రవాణా సౌకర్యం కూడా కల్పించారు.

ఆలయాలకు విరాళాల వెల్లువ



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న ఆకుల వెంకటేశ్

షాద్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ పరిధి చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయం, ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట భవానీమాత ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరుచేసిందని ఎమ్మెల్యే శంకర్ శనివారం తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయానికి రూ.50లక్షలు వెచ్చిస్తామన్నారు. మ్యాచింగ్ గ్రాంట్ ఫండ్ కింద షాద్‌నగర్‌కు చెందిన ఆకుల వెంకటేష్ దంపతులు తమ కుమారుడి జ్ఞాపకార్థం రూ.10లక్షలు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఎలికట్ట భవానీమాత ఆలయానికి ఎమ్మెల్యే రూ.5లక్షల విరాళమిచ్చారు. షాద్‌నగర్‌లోని వేంకటేశ్వరాలయంలో గరుడ, హనుమ ప్రాకార గోపురాలకు టీడీపీ నేత చల్లా వెంకటేశ్వర రెడ్డి దంపతులు రూ.లక్షను మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుకు అందజేశారు. మొగిలిగిద్దలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్తుడు అనుమారి వెంకటయ్య రూ.51వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తిమార్గంలో నడిస్తేనే మనిషికి శక్తి వస్తుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

డ్రోన్‌తో పంటపై రసాయనాల పిచికారి

● పది నిమిషాల్లో ఎకరంలో స్ప్రే!



కంది పంటపై మందు పిచికారి చేస్తున్న డ్రోన్

బొంరాస్‌పేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దుద్యాలలో ఓ రైతు తన కంది పంటకు శనివారం డ్రోన్‌తో రసాయన మందు పిచికారి చేశాడు. దీంతో స్ప్రే చేస్తే ఎకరానికి ఒక బిందె నీరు మాత్రమే సరిపోతుంది. 10నిమిషాల్లో ఎకరా పొలానికి పిచికారి చేస్తుందని రైతు తెలిపాడు. ఎకరా పిచికారికి రూ.450 ఖర్చు అవుతుందన్నారు.

చిత్తడిగా మార్కెట్ దారి

షాద్‌నగర్ రూరల్ అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని షాహీ గార్డెన్ ఎదుట రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతారు. ఈ రోడ్డు చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతోంది. గతంలో వేసిన సీసీ లేచిపోయి మట్టి రోడ్డులా మారింది. వర్షం పడితే రోడ్డు బురదమయం అవుతోంది. దుకాణాల వద్ద బురద ఉండటంతో కొనుగోలుదారుల రావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ఈ రోడ్డును అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలంటున్నారు. కుళ్లిన కూరగాయలు రోడ్డుపైనే పారబోస్తుండటంతో అటువైపు వెళ్లేవారికి దుర్వాసన వస్తోంది. మున్సిపల్ అధికారులు ఇప్పటి కైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వికారాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): తైక్వాండోతో ఆత్మరక్షణ, ఆరోగ్య పరిరక్షణ కలుగుతాయని, అలాగే ఈ క్రీడతో ఉద్యోగపరమైన రిజర్వేషన్ కూడా లభిస్తుందని తైక్వాండో జిల్లా అసోసియేషన్ చైర్మన్ రాఘవన్‌నాయక్ తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని తేజఫంక్షన్ హాల్‌లో 68వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్ 14, 17 బాలబాలికలకు పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. పోటీల్లో సుధీర్, సురేందర్‌సింగ్, గోపాలకృష్ణ జడ్జీలుగా వ్యవహరించారు.



చైర్‌పర్సన్‌తో సమావేశమైన టౌన్ ప్లానింగ్ ఆర్జేడీ నర్సింహారెడ్డి

మాస్టర్ ప్లాన్ కోసం డ్రోన్ సర్వే

తాండూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో తిరిగి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసుకునేలా డ్రోన్ సర్వే చేస్తున్నామని హైదారాబాద్ రేంజ్‌టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి చెప్పారు. శనివారం తాండూరులో అక్రమ నిర్మాణాలపై చేపట్టే డ్రోన్‌సర్వేపై పరిశీలనకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21న డ్రోన్ సర్వే చేసి, ఆరు నెలల్లో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను దశలవారీగా క్రమబద్ధీకరిస్తామన్నారు. ఆర్జేడీ వెంట రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు. కాగా తాండూరులో అక్రమ నిర్మాణాలపై తాను ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు స్పందించ లేదని చైర్‌పర్సన్ స్వప్న ఆర్జేడీతో అన్నారు. చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్జేడీతో స్వప్న ఆవేదన వ్యక్తం చేశారు. తాను తాండూరులోనే ఉంటానని, అక్రమ నిర్మాణాలపై పట్టించుకోకుంటే ఎలా అని ప్రశ్నించారు. నాలాలాపై అక్రమ నిర్మాణాలను తొలగించడం లేదన్నారు. సమావేశంలో కమిషనర్ విక్రమసింహారెడ్డి, టీపీవో అధికారులు పవన్, కరుణాకార్ ఉన్నారు.

ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ దోపిడీ



విలేఖరులతో మాట్లాడుతున్న జి.జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో కాంగ్రెస్ దోపిడీకి తెరలేపిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆరోపించారు. గతంలో చేపట్టిన పనులకు కమీషన్లు ఇస్తేనే బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో ఇళ్లు కూల్చుతూ పేదలను రోడ్డుపాలు చేస్తోందన్నారు. ఆమనగల్లులోని కల్యాణి గార్డెన్‌లో శనివారం జైపాల్‌యాదవ్ విలేఖరులతో మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో భారీగా నిధులు కేటాయించి ప్రజాధనాన్ని దోచుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. 6 గ్యారంటీల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజాగ్రహాన్ని మరిపింపజేయాలనే హైడ్రాపేరుతో మోసానికి తెర లేపారన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఎవరి కోసం మారుస్తున్నారని ప్రశ్నించారు. కల్వకుర్తికి సాగునీటిని అందించిన ఘనత బీఆర్ఎస్‌దే అన్నారు. కేసీఆర్ పాలనలో కేఎల్ఐ డి-82 కాల్వ నిర్మాణానికి నిధులిచ్చి పనులు పూర్తి చేయిస్తే.. కాంగ్రెస్ నాయకులు తమ ఘనతే అని చెప్పుకోవడం హాస్యాస్పదం అన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి నిస్వార్థ సేవలందించానని, రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశానని జైపాల్ అన్నారు. తన రాజకీయ జీవితంలో చిన్న తప్పు చేశానని నిరూపించినా రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రాజకీయ అవివేకి, అజ్ఞాని అని జైపాల్‌యాదవ్ నిప్పులు చెరిగారు. రెండుసార్లు ఎమ్మెల్సీగా చేసిన కేసీఆర్‌ను కసిరెడ్డి విమర్శించడం తగదన్నారు. విద్యా వ్యాపారి అయిన కసిరెడ్డి జీవితం గురించి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. బీఆర్ఎస్‌లో గ్రూపు రాజకీయాలు చేసి పార్టీ ఓడేలా చేశారని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ అనురాధ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, పార్టీ పట్టణాధ్యక్షుడు పత్యనాయక్, నిరంజన్‌గౌడ్, రఘు, సాయిలు, గుత్తి బాలస్వామి, శ్రీను, శంకర్, రమేశ్‌నాయక్, సుభాష్, సైదులు, గణేశ్‌నాయక్, రమేశ్ నాయక్, కె.శ్రీను తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



నందిగామ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరం అని, కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు అన్నారు. మండల కేంద్రానికి చెందిన దాసరి రవి కొన్నిరోజులుగా అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈమేరకు ఆయనకు మంజూరైన రూ.34వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం నర్సింలు స్థానిక నాయకులు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, పిట్టల రాములుతో కలసి లబ్ధిదారుడికి అందజేశారు.

బండలపై బెండ సాగు

- విసూత్న ఆలోచనతో ముందుకు
- బండరాళ్లపై మట్టిని పేర్చి సాగుచేసిన బెండ తోట
- ఆదర్శంగా నిలుస్తున్న ఆదిభట్ల రైతు

ఆదిభట్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీకి చెందిన యువరైతు కోరే శేఖర్‌కు ఆదిభట్ల గ్రామానికి ఆనుకోని అర ఎకరం పొలం ఉంది. కాని గతంలో ఇసుక ఫిల్టర్లు నడుస్తున్న సమయంలో ఇసుకను తోడటంతో దాదాపు 20 ఫీట్ల మేరకు గుంత పడింది. అలాగే పక్కనే కుంట ఉండటంతో ఈయనకున్న అర ఎకరం భూమి కూడా కుంటలా మారిపోయింది. ఉన్నదే అర ఎకరం అదీ పెద్ద గుంతలా మారిపోవడంతో మొదట ఆందోళన చెందాడు. వెంటనే తేరుకొని అందరి లాగా దిగాలు పడకుండా కొత్తగా ఆలోచించాడు. తనకు తెలిసిన ఓ వ్యక్తి వెంచర్ చేస్తున్న క్రమంలో బండరాళ్లు తొలగిస్తున్నాడు. వాటిని తీసుకువచ్చి ఆ గుంతను పూడ్చడం చేశాడు. గుంత రోడ్డు లేవల్‌కు రావడంతో బండరాళ్లపై ఎర్రమట్టిని పరిచాడు. అంతే అంతే ఆ గుంత కాస్తా అర ఎకరం వ్యవసాయ భూమిగా మారింది. వెంటనే బోరు వేసి బెండ తోట సాగు చేశాడు. ఇప్పటి వరకు ఉన్న గుంత కాస్తా ఆదిభట్ల మేయిన్ రోడ్డులో ఖరీదైన వ్యవసాయ భూమిగా మారిపోయింది.



రాళ్లపై పోసిన ఎర్రమట్టిలో సాగవుతున్న బెండ పంట

టిప్పర్‌తో బండల తరలింపు

నాకు ఉన్న అర ఎకరం భూమిలో ఫిల్టర్ ఇసుక కోసం మట్టిని తవ్వారు. దాంతో ఆ ప్రాంతమంతా పెద్ద గుంతలా మారిపోయింది. దాంతో ఉన్న భూమి పోయిందని బాధ పడకుండా దానిపై మళ్లీ మట్టి నింపి చూద్దాం అనుకున్న. మాకు తెలిసిన వ్యక్తి రావిరాల దగ్గర వెంచర్‌లో బండలు తీస్తున్నడని తెలిసింది. టిప్పరుతో బండలు తరలించి ఇరవై ఫీట్లు ఉన్న గుంతను రాళ్లతో నింపాను. తర్వాత పైనుంచి మట్టి నింపాను. అనంతరం బోరు వేసి బెండ తోట వేసిన. మొక్కలు బాగానే వచ్చాయి. ఇప్పుడు నా భూమి నాకు వచ్చింది. వ్యవసాయం నడుస్తోంది అంటూ సంతోషంగా చెబుతున్నాడు రైతు శేఖర్.



మొదట బండ రాళ్లతో నింపిన గుంత

బైక్‌కు డబ్బులు ఇవ్వలేదని..

మేడ్చల్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బైక్ కొనేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో మనవడు నానమ్మను చంపేశాడు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి ఘటన జరిగింది. బాలమ్మ (62) తన కొడుకు మధుతో కలిసి మేడ్చల్ మండలం రావల్‌కోల్ గ్రామంలో నివాసం ఉంటోంది. మధుకు ముగ్గురు కూతుళ్లు, కొడుకు ప్రశాంత్(21) ఉన్నాడు. ప్రశాంత్ వ్యసనాలకు అలవాటు పడి జులాయిగా తిరిగేవాడు. డబ్బులు అవసరం ఉన్నప్పుడల్లా నానమ్మతో గొడవ పడి చేతికందినంత తీసుకునేవాడు. దీంతో, గ్రామంలో బాలమ్మ పేరిట ఉన్న కొద్దిపాటి ఆస్తిని సంవత్సరం క్రితం అమ్మారు. మిగతా డబ్బును చిన్న మనవరాలి పెళ్లి కోసం బ్యాంకులో దాచారు. అయితే, ప్రశాంత్ తన వాటా కింద రావాల్సిన డబ్బుతో బైక్ ఇప్పించాలని తరచూ నానమ్మతో గొడవ పడేవాడు. దీంతో, శుక్రవారం ఇద్దరు అక్కలు(బాలమ్మ మనవరాళ్లు) ఇంటికి వచ్చి ప్రశాంత్‌ను మందలించి వెళ్లారు. బాలమ్మపై కోపం పెంచుకున్న ప్రశాంత్ శుక్రవారం రాత్రి మద్యం తాగివచ్చి బాలమ్మతో గొడవ పడ్డారు. ఈ క్రమంలో బాలమ్మ తలను ఇంట్లో గోడకేసి బాదాడు. తలకు బలమైన గాయం కావడంతో వృద్ధురాలు అక్కడే చనిపోయింది. పోలీసులు ప్రశాంత్‌ను అదుపులో తీసుకున్నారు.

కుల గణనకు కసరత్తు

- రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు బాధ్యత
- ఆర్థిక, సామాజికాంశాలపై లెక్కలు

తాండూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కుల గణనకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. శాఖల వారీగా అధికారులు, సిబ్బంది, ఉన్నతాధికారుల వివరాలు కోరుతున్నారు. మండల పరిషత్, రెవెన్యూ, విద్యాశాఖ, మున్సిపల్, ఐసీడీఎస్, మెప్మా, ఐకేపీ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కంటే పైనున్న అధికారుల సెన్సెస్ సేకరిస్తున్నారు. తాండూరు డివిజన్‌లో తాండూరు, కొడంగల్ మున్సిపాలిటీలు, ఏడు మండలాలు ఉన్నాయి. బీసీ కమిషన్ ఆధ్వర్యంలో కులగణన చేపట్టారు. ఈ నెల 9న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు 60 రోజుల్లోనే కులగణన పూర్తికి యంత్రాగం కసరత్తు చేస్తోంది. తాజా కులగణనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జనాభా వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు ఎదురు చూస్తున్నారు. ఇంటింటికి వెళ్లి కులగణనను రెండు నెలల్లో పూర్తి చేస్తారు.

రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు బాధ్యత

కులగణన బాధ్యతను రెవెన్యూ, పట్టణాల్లో మున్సిపల్ శాఖలకు అప్పగించే అవకాశాలున్నాయి. తహసీల్దార్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ, ఎంఈవోలకు, మున్సిపల్ కమిషనర్లకు అప్పగించే అవకాశాలున్నాయి. పట్టణాల్లో వార్డు ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిల్లో విధులు నిర్వర్తిస్తారు. కాగా 13ఏళ్ల తర్వాత గణన చేస్తున్నారు. 2011లో సామాజిక ఆర్థిక కులగణన నిర్వహించారు. అప్పట్లో కుటుంబ సభ్యుల, ఆరు రకాల ఇతర వివరాలను సేకరించారు. వచ్చే డిసెంబరులో తాజా గణన పూర్తి చేస్తారు.



2011 కుల గణన ముసాయిదా

తాండూరు డివిజన్ జనాభా వివరాలు

మండలం/మున్సిపాలిటీ	గ్రామాలు/వార్డులు	జనాభా(2011లో)	ఓటర్ల సంఖ్య
తాండూరు మున్సిపాలిటీ	36 వార్డులు	71,008	71,331
కొడంగల్ మున్సిపాలిటీ	12వార్డులు	14,294	9,998
తాండూరు మండలం	37	1,18,776	45,5678
పెద్దేముల్ మండలం	29	51,893	39,807
యాలాల మండలం	36	45,295	37,511
బషీరాబాద్ మండలం	32	43,562	39,817
బొంరాస్‌పేట్ మండలం	16	52,211	44,371
కొడంగల్ మండలం	19	39,372	31,997
దౌల్తాబాద్ మండలం	25	51,411	43,393

మొత్తం 260 గ్రామపంచాతీలు, 48 మున్సిపల్ వార్డులు ఉన్నాయి





తాండూరులో సీపీఎం మహసభల సందర్భంగా ర్యాలీలో కార్యకర్తలు

ఎరుపెక్కిన తాండూరు

తాండూరు, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): సీపీఎం వికారాబాద్ జిల్లా తృతీయ మహాసభలు తాండూరులో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు పట్టణంలోని బస్టాండ్ నుంచి ఆర్యవైశ్య పంక్షన్ హాల్ వరకు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రయ్య పార్టీ జెండాను ఎగురవేశారు. మహాసభలకు ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. వెంకట్‌రాములు, జగదీష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 11ఏళ్లలో పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింతా ధనవంతులుగా తయారయ్యారన్నారు. ప్రధాని మోదీ పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తున్నారని, నిత్యావసర ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపారన్నారు. ఎర్ర జెండా ఆధ్వర్యంలో మోదీ మత్నోన్మాద , ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వ్యవహరిస్తుందన్నారు. రాబోయే రోజులు ఎర్ర జెండావేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మహిపాల్, వెంకటయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బోరు బావిలోకి మురుగు నీరు



నవాబుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి ట్యాంకుల ద్వారా వృథాగా వెళ్తున్న నీరు బోరు బావిలోకి వెళ్తుందని గ్రామస్థులు అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శ్వేతను వివరణ కోరగా మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రజ్యోతి ఉదయం ఫొటోలు తీయడంతో సాయంత్రం పంచాయతీ అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టారు.




సీఎం నుంచి మెడల్, ప్రశంసా పత్రం అందుకుంటున్న రాజు

పోలీస్ డ్యూటీ మీట్‌లో దుద్యాల వాసికి అవార్డు

బొంరాస్‌పేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీస్ డ్యూటీ మీట్-2024 సందర్భంగా హైదరాబాద్‌లో పోలీసు అధికారులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో డీజీపీ కార్యాలయంలో ఐటీ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దుద్యాల మండల కేంద్రానికి చెందిన మునగాల రాజు 98 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. శనివారం పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన మెడల్‌తో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు.

అట్టహాసంగా కళా ఉత్సవ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో న్యాయ నిర్ణేతలు

వికారాబాద్ అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీలను జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ప్రారంభించారు. ఈ టీంలలో జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 150మంది విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను చాటారు. నృత్యం(క్లాసికల్-ట్రెడీషనల్), సంగీతం, ఏకపాత్రాభినయం, చిత్రలేఖనం, నాటిక, కథలు చెప్పడం అనే ఆరు అంశాలపై ఈ పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రామ్ మస్తాన్, న్యాయ నిర్ణేతలు శివ జ్యోతి, ప్రమంతి, శ్రీనివాస్, శ్రీకాంత్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజధానికి దగ్గరలో ఉన్నా..
రాతమారని కడ్తాల

- ఎనిమిదేళ్లుగా నిర్మాణం పూర్తికాని మండల పరిషత్ కార్యాలయ భవనం
- నిధుల్లేక మధ్యలో నిలిచిన పనులు
- డెయిరీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభమెప్పుడో?
- హామీలకే పరిమితమైన జూనియర్ కాలేజీ, బస్టాండ్, ఆస్పత్రుల నిర్మాణం
- అద్దె కార్యాలయాల్లో వసతుల్లేక ఇబ్బందులు



శిథిలావస్థకు చేరిన కడ్తాలలోని పాల శీతలీకరణ కేంద్ర భవనం

కడ్తాల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 2016లో కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటులో కడ్తాల మండల కేంద్రమైంది. మండల కేంద్రంతో సౌకర్యాలు కలిగి ఇబ్బందులు తొలగుతాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. 8ఏళ్లయినా మండల కార్యాలయాల భవనాలు, అనుగుణ వసతులు కల్పించలేదు. దీంతో 24 పంచాయతీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నెలకొన్న సమస్యలవీ

- కడ్తాల మండల పరిషత్ నిర్మాణానికి రూ.50 లక్ష లు అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసింది. 2023 సెప్టె ంబరు 8న అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాప న చేశారు. నిధులున్నంత వరకు కాంట్రాక్టర్ పను లు చేపట్టాడు. ప్రస్తుతం గ్రౌండ్‌ఫ్లోర్ స్లాబ్ నిర్మించారు. అవ సరమైన నిధులు రాక, ప్రజాప్రతినిధుల చొరవ లేక భవ న నిర్మాణ అసంపూర్తిగానే మిగిలిపోయింది.
- కడ్తాల పాల శీతలీకరణ కేంద్రం వద్ద డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ 2022లో నిర్మించిన దుకాణ సముదాయం ప్రారంభించక షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉంది. దీనిని ప్రారంభించాలని ఇటీవల నాయకులు డెయిరీ చైర్మన్‌కు వినతి పత్రం ఇచ్చారు. డెయిరీ చిల్లింగ్ సెరంట్ భవనం సైతం శిథిలావస్థకు చేరింది. విజయ డెయిరీ సకాలంలో బిల్లులు చెల్లించక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయానికి సైతం సొంత భవనం లేదు.
- కడ్తాలలో 2023 సెప్టెంబరు 8న మహిళా సమా ఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభించ లేదు. ఎస్‌డీఎఫ్ నుంచి రూ.20లక్షలు కేటాయించినా పనులు చేయలేదు. దీంతో సమావేశాలకు భవనంలేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.
- కడ్తాలలో బస్టాండ్ లేదు. బస్సుల కోసం రోడ్లపైనే వేచి ఉంటున్నారు. ఎండ, వానకు ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ హాస్టళ్లలోనూ విద్యార్థులకు సరైన వసతుల్లేవు. కడ్తాలలో ప్రభుత్వ ఆస్పత్రి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీసీ గురుకుల పాఠశాలకు సొంత భవనం లేక యాచారంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



కడ్తాల మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి పరిష్కరించాలి. కొత్త మండల ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలి. అసంపూర్తిగా నిలిచిపోయిన మండల పరిషత్ భవన నిర్మాణానికి అదనంగా రూ. కోటి మంజూరు చేసి పనులు పూర్తిచేయాలి. మంజూరైన మహిళా సమాఖ్య, పీహెచ్‌సీ భవనాల నిర్మాణం చేపట్టాలి. పాలశీతలీకరణ కేంద్రం ఎదుట నిర్మించిన దుకాణ సముదాయాన్ని ప్రారంభించాలి. కడ్తాలలో కళాశాల, బస్టాండ్, నిర్మాణాలు వెంటనే చేపట్టాలి.

- దశరథ్‌నాయక్, మాజీ జడ్పీటీసీ, కడ్తాల్

ఎవరూ పట్టించుకోవడం లేదు



2016లో కడ్తాలను మండల కేంద్రం చేసినా పాలనాపరంగా నేటికీ ప్రజలకు అవసరమైన తగిన వసతులు కల్పించలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు తొలగ లేదు. హైదరా బాద్‌కు 50 కిలోమీటర్ల లోపే ఉన్నా కడ్తాల అభివృద్ధిలో నిర్లక్ష్యానికి గురవుతోంది. మండల అభివృద్ధికి రాజకీయాలు పక్కనబెట్టి అందరూ ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు అనువైన స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించాలి. అసంపూర్తి ఉన్న భవనాలు పూర్తిచేయాలి.

- దోనాదుల మహేశ్, కడ్తాల్

అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి చొరవ



కడ్తాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నిధులు రాబట్టేలా కృషిచేస్తున్నాం. కేజీబీవీ, తహసీల్దార్ కార్యాలయ భవనాలను ఇప్పటికే ప్రారంభించాం. మండల పరిషత్ భవనానికి అవసరమైన నిధులు కేటాయించి నిర్మాణం పూర్తి చేస్తాం. కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు.

- గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీ, కడ్తాల్

బంగారం దొంగ.. మేనేజరే



బంగారం కోసం మణప్పురం బ్యాంక్‌కు వచ్చిన తాకట్టుపెట్టిన వారు

వికారాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : '3కేజీల బంగారంతో పరారీ ?.. ఫైనాన్స్ సంస్థ మేనేజర్ పనేనని గుసగుసలు' అంటూ శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆ కంపెనీ ప్రతినిధులు స్పందించారు. ఆంధ్రజ్యోతి ముందుగా చెప్పినట్లుగానే మేనేజరే ఈ పని చేశారన్నట్లుగానే మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న మేనేజర్ విశాల్ అసలు దొంగ అని నిర్ధారణ అయింది. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త చక్కర్లు కొట్టడంతో నిజాలు బయట పడ్డాయి. ఉదయం నుంచి బంగారం తాకట్టు పెట్టిన వారు బ్యాంకు వద్దకు పరుగులు తీశారు. తమ బంగారం ఉందా? లేదా అంటూ అక్కడ ఉన్న సిబ్బందిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈక్రమంలో కొందరూ లోపలికి దూసుకెళ్లే ప్రయత్నం చేయగా బ్యాంకు సిబ్బంది అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. వికారాబాద్ సీఐ భీమ్ కుమార్, సిబ్బంది అక్కడికి చేరుకుని విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంస్థ ఆడిట్ అధికారిగా వచ్చిన శంకర్ రెడ్డి అనే వ్యక్తి మాట్లాడుతూ. మేనేజర్ విశాల్ బంగారం తీసుకెళ్లిన మాట వాస్తవమని బంగారం పోయిన ప్రతి ఒక్కరికి సంస్థ బాధ్యత తీసుకుంటుందన్నారు. విశాల్ గురించి పోలీసులకు ఫిర్యాదు చేశామని, పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాజేసిన బంగారం విలువ రూ.2.10కోట్లు

బ్యాంక్‌లో నుంచి మేనేజర్ విశాల్ 63 ప్యాకెట్లను దొంగలించినట్లుగా పోలీసులు గుర్తించారు. అందులో 2.600 కిలోల బంగారం ఉండగా దాని విలువ రూ.2.10 కోట్లుగా ఉంటుందని స్పష్టమైంది. అయితే బ్యాక్ మేనేజర్ విశాల్‌తో పాటు అందులో పనిచేసే అసిస్టెంట్ మేనేజర్‌కు కలిపి రెండు తాళాలు బంగారం లాకర్‌వి ఉండాల్సి ఉంటుంది. అక్కడ అసిస్టెంట్ మేనేజర్ పోస్టు ఖాళీగా ఉండడంతో అందులో పనిచేసే మరో కింది స్థాయి సిబ్బందికి తాళం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. దీన్ని అదునుగా చేసుకున్న మేనేజర్ ఆ వ్యక్తికి సంబంధం లేకుండా బంగారం కాజేసి 18వ తేదీ నుంచి విధులకు రావడం లేదని గుర్తించారు. మేనేజర్ కర్ణాటక ప్రాంతానికి చెందిన వ్యక్తి కాగా మణప్పురంలో గత నాలుగైదు సంవత్సరాలుగా పనిచేస్తూ వచ్చారు. సంవత్సరన్నర కాలంగా వికారాబాద్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీస్ అధికారులు, సంస్థ సిబ్బంది 16వ తేదీ బంగారం బయటకు తీసుకెళ్లినట్లుగా అనుమానిస్తున్నట్లుగా తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమ్‌కుమార్ తెలిపారు.

'కేటీఆర్‌పై తప్పుడు వ్యాఖ్యలు సరికాదు'

వికారాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో కేటీఆర్ నేవీ రాడార్ కోసం కోట్లలో తీసుకున్నాడంటూ అసెంబ్లీ స్పీకర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పీకర్ పదవిలో ఉండి ఇలాంటి తప్పుడు రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. 12లక్షల వరకు చెట్లు నరికి వేసి పచ్చని అడవిని నాశనం చేస్తున్నారని సమాజ హితం కోసం ప్రజల పక్షాన కేటీఆర్ పోరాటం చేస్తున్నందున ఈ రాష్ట్ర ప్రభుత్వం జీర్ణించుకోలేక స్పీకర్ ద్వారా ఇలాంటి తప్పుడు ఆరోపణలకు తెర లేపడం దారుణమన్నారు. స్పీకర్ తన వ్యాఖ్యాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

న్యూస్ బాక్స్

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు: డీఎస్పీ


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఈ విషయంలో తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. తాండూరులో శనివారం తనిఖీలు చేపట్టారు. మైనర్లు నడుపుతున్న 25 బైక్‌లను స్వాధీనం చేసుకుని వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. పూడూరులో ఆర్టీసీ బస్సు, బైక్ ప్రమాదంలో మైనర్లు మృతిచెందిన విషయాన్ని దృష్టిలో పెట్టుకొని పోలీసులు తాండూరులో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సంతోష్ కుమార్, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాండూరు రూరల్ సీఐగా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు


ఎస్పీని కలిసి మొక్కను అందజేస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తాండూరు రూరల్ సీఐగా శ్రీనివాస్ రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇసుక అక్రమ రవాణ నియంత్రణలో విఫలమయ్యారనే అభియోగాలతో ఇక్కడ పనిచేసిన రూరల్ సీఐ అశోక్‌కుమార్ ఐజీ కార్యాలయానికి అటాచ్ అయిన విషయం విధితమే. దీంతో ఆయన స్థానంలో సంగారెడ్డి జిల్లా నుంచి శ్రీనివాస్‌రెడ్డిని అధికారులు తాండూరురూరల్ పోలీసుస్టేషన్‌కు బదిలీచేయగా ఆయన ఎస్పీని కలిసి మొక్కలను అందజేశారు.

అకాల వర్షం.. పత్తికి తీరని నష్టం


బషీరాబాద్: పత్తిని తీసి రోడ్లపై ఆరబెడుతున్న వ్యవసాయ కూలీలు

బషీరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో చేతికొచ్చిన పత్తి పంట దెబ్బతింటోంది. వర్షాలకు రంగుమారి నాణ్యత కోల్పోతోంది. సకాలంలో వర్షాలు కురవడంతో ఈ ఏడాది దిగుబడులు కాస్త మెరుగ్గా ఉంటాయని రైతులు ఆశించారు. కానీ పత్తితీత (కోత) సమయంలో వర్షాలు కురుస్తుండటం దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. పత్తి పంటలకు ఈ వర్షాలు అంత మంచిది కాదని రైతులంటున్నారు. ఇప్పటికే పత్తితీత పనులు చేపట్టిన రైతన్నలు తడిసిన పత్తిని పొలాల వద్దనే రోడ్లపైనే ఆరబెట్టి ఇంటికి తీసుకెళ్తున్నారు. అసలే ఓ పక్క పత్తిపంట దెబ్బతినగా, పత్తి ఆరబెట్టేందుకు రైతులకు అదనంగా ఖర్చులు పెరగడంతో లబోదిబోమంటున్నారు. మరోవైపు ఈవర్షం తెల్ల జొన్న, పప్పుశనగ, వేరుశనగ పంటల సాగుకు ఇది అనుకూలం కానుంది. మండల వ్యాప్తంగా పత్తి 6వేల ఎకరాలకు పైగా సాగుచేశారు.


బషీరాబాద్: పత్తి పొలాల్లో నిలిచిన వర్షంనీరు

మత్స్యశాఖ అభివృద్ధికి కృషి


కోట్‌పల్లి ప్రాజెక్ట్‌లోకి చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బంట్వారం(కోట్‌పల్లి) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ అభివృద్ధికి కృషిచేస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్ట్‌లో శనివారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో 100శాతం సబ్సిడీతో ఉచిత చేపపిల్లలను నీటిలో వదిలారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా ప్రసిద్ధి చెందిన కోట్‌పల్లి ప్రాజెక్ట్‌లో చేపపిల్లలను వదలడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మత్స్యకారులు పుట్టీలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికితీసుకెళ్లడంతో ప్రభుత్వం నుంచి డబ్బులు రాకున్నా నా సొంత డబ్బులతో పుట్టీలు త్వరలో అందజేస్తామని వారికి భరోసా ఇచ్చారు. ప్రాజెక్ట్ సమీపంలో గత ప్రభుత్వం మత్స్యకారుల కోసం భవనం నిర్మించాలని ఉద్దేశంతో భవనం మంజూరు చేసిందని ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనానికి నిధులు లేక పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో భవనానికి సరిపడా నిధులు మంజూరు చేసి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అంజయ్య, మత్స్యశాఖ అధ్యక్షుడు ఆనంద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, నాయకులు మహిపాల్‌రెడ్డి, బందయ్య, నారాయణరెడ్డి, దినేష్, రమేష్ సాగర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని రాఘవేంద్రనగర్, బాలాజీ నగర్ కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసోకోవాలని కోరుతూ శనివారం లోటస్ ఎన్‌క్లేవ్ కాలనీవాసులు మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లోటస్ కాలనీ వాసులు మాట్లాడుతూ... మున్సిపల్ పరిధిలోని రాఘవేంద్రనగర్, బాలాజీ నగర్ కాలనీల్లో పార్కుస్థలాలను కబ్జాచేసి ఇళ్లను నిర్మించారని, సెట్‌బ్యాక్‌లు లేకుండా ఇళ్లు నిర్మించి రోడ్లను ఆక్రమించారని ఆరోపించారు. దీనికి తోడు తమ కాలనీ సమీపంలో ఉన్న సేయింట్ క్లారెట్ పాఠశాల నుంచి రాఘవేంద్రనగర్, బాలాజీనగర్ కాలనీలకు వెళ్లే జాతీయ రహదారి రోడ్డు మలుపు వరకు సర్వీస్ రోడ్డును ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వీస్‌రోడ్డు లేని కారణంగా పాఠశాల విద్యార్థులు ప్రమాదాలకు గురికావాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

ఘట్‌కేసర్: ప్రభుత్వం తమకు కేటాయించిన భూమిలో రాత్రికిరాత్రే ఇళ్లు నిర్మిస్తూ తమకు తీరని అన్యాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అసైన్డ్ దళిత రైతులు శనివారం మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు 1960వ సంవత్సరంలో చౌదరిగూడలోని సర్వేనెంబర్ 869లోని 11 ఎకరాల 32గుంటల భూమిని భూమిలేని తొమ్మిది మంది నిరుపేద దళిత కుటుంబాలకు పంపిణీ చేసి పట్టా సర్టిఫికెట్లు ఇచ్చిందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయం సాధ్యపడలేదని, ఇదే అదనుగా కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, స్థానిక నాయకుల అండదండలతో నకిలీ ఇళ్ల పట్టాలు సృష్టించారని ఆరోపించారు. ఈఅక్రమ నిర్మాణాలపై తాము కోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్‌ను సైతం పొందినట్లు తెలిపారు. అయినప్పటికీ అక్రమ నిర్మాణాలు ఆపకపోగా, తమపై భౌతికదాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని యాదయ్య, నాగలక్ష్మి, జంగయ్య, పెంటమ్మ, రాజు, దేవమ్మ, అమృత, లక్ష్మి కలెక్టర్‌ను కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు

మేడ్చల్ ప్రతినిధి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో రోడ్డు సేఫ్టీ ఎక్స్‌పర్ట్ ధీరేంద్ర సామినేని పాల్గొని ఐడీపీసీ ఉద్యోగులకు, అధికారులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి రఘునందన్‌గౌడ్, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మురికి కుంటలో పడి మహిళ మృతి

మేడ్చల్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మురికి కుంటలో పడి ఓ మహిళ మృతిచెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీధుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకునే యాదమ్మ(45) కండ్లకోయ గ్రామ సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ వెనుక ఉన్న మురికి కుంటలో శనివారం శవమై తేలాడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మురికికుంట నుంచి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

దీపావళి ఆఫర్ అంటూ మోసం

● డబ్బులతో ఉడాయించిన కేటుగాళ్లు


మోసానికి పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తి

ధారూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి ఆఫర్ ఉందంటూ తక్కువ ధరకు వివిధ రకాల వస్తువులు ఇస్తామంటూ నమ్మించి ముగ్గురు కేటుగాళ్లు కొంతమంది వద్ద డబ్బులు వసూలుచేసి ఉడాయించారు. ఈ ఘటన ధారూరులో శుక్రవారం జరిగింది. బాధితులు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ధారూరులోని వీధుల్లో తిరుగుతూ దీపావళి ఆఫర్ ఉందంటూ తక్కువ ధరకు వస్తువులు విక్రయిస్తామని ఇళ్ల చుట్టూ తిరిగారు. తమ సెల్‌ఫోన్‌లో బీరువాలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్, వివిధ రకాల సెల్‌ఫోన్లు, ఇతర గృహోపకరణాలు చూపించి సగంధరకే ఇస్తామని నమ్మబలికారు. వీరి నినమ్మిన కొందరు డబ్బులు ఇచ్చారు. కాగా డబ్బులు వసూలు చేసిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు గ్రామం నుంచి ఉడాయించారు. గ్రామంలో పదిమంది వద్ద రూ.3 నుంచి రూ.6వేల వరకు డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. సాయంత్రం వరకు వీరి జాడలేకపోవటంతో బాధితులకు అనుమానం వచ్చి వారు ఇచ్చిన ఫోన్ నెంబర్లకు డయల్ చేయగా పనిచేయడంలేదు. ముగ్గురిలో ఒకరు ఫోన్ లిఫ్ట్ చేసి దుర్భాషలాడటంతో బాధితులు మోసపోయామని గ్రహించారు.ముగ్గురు మోసగాళ్లలో ఒకరిని సెల్‌ఫోన్‌లో ఫొటో తీసిన బాధితులు పోలీసులకు ఆ ఫొటోను చూపించి జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కులకచర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ముజాహిద్‌పూర్ గేటు సమీపంలో శనివారం పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ ఆటోలో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఈ మేరకు ఆటోను పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డికి డాక్టరేట్

ధారూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డికి పాండిచ్చేరి రాష్ట్రంలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. యూనిర్సిటీ కన్వొకేషన్‌లో యూనివర్సిటీ బాధ్యులు ఆయనకు డాక్టరేట్‌ను అందజేశారు. రాజకీయ, సామాజిక రంగంలో సేవలందించినందుకు రఘువీరారెడ్డి యూనివర్సిటీ నుంచి శనివారం డాక్టరేట్‌ను అందుకున్నారు. కాగా పాండిచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి, పార్లమెంట్ సభ్యుడు వైతలింగం, శాసనసభపక్ష నేత వైద్యనాతన్‌ను ఆ రాష్ట్ర పీసీసీ కార్యాలయానికి రఘువీరారెడ్డి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ ముదిరాజ్, నాయకులు మల్లారెడ్డి, ఎర్రవల్లి జాఫర్, రాజేశ్వర్, ప్రవీణ్ రెడ్డి, యూనివర్సిటీ బాధ్యులు పాల్గొన్నారు.

22 నుంచి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉత్సవాలు

పరిగి, అక్టోబరు 19: పరిగిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం తృతీయ వార్షికోత్సవాలకు సిద్ధమైంది. ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు ఎదిరె పద్మ,కృష్ణ, జయశ్రీ, నరేందర్‌లు తెలిపారు. ఈనెల 22న మంగళవారం ఉదయం 9 గంటలకు యాగశాల ప్రవేశం, విశ్వేశ్వనఆనాధాన, వాసుదేవ పుణ్యావచనం, దీక్షాదారణ, రుత్వీకర్మగణం, మృత్యంగ్రహణం, అంకురార్పణ, ఆఖండదీపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, ధ్వజారోహణం పూజ, హోమం, భేరిపూజ, దేవతాహ్వానం, నివేదన, తీర్థప్రసాదన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్‌లు పాల్గొంటారని తెలిపారు.

ప్రమాణాలతో కూడిన విద్యను బోధించాలి

పరిగి, అక్టోబరు 19: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను బోధించాలని పరిగి మండల ఇన్‌చార్జి ఎంఈవో గోపాల్ సూచించారు. పరిగి మండల పరిధిలోని మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. విద్యాబోధననే కాకుండా నైతిక విలువలను నేర్పించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, మంచి విద్యను అందించాలని సూచించారు. అనంతరం మొదటిసారి పాఠశాలకు వచ్చిన సందర్భంగా ఎంఈవో గోపాల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎండీ ఉస్మాన్‌అలీ, అమ్మఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ అనురాధ, ఉపాధ్యాయులు కృష్ణయ్య, నర్సింహులు, రాజు, కవిత, శ్రీశైలం పాల్గొన్నారు.

బషీరాబాద్ మండల పీఆర్ ఏఈగా యశ్వంత్

బషీరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మండల పంచాయతీరాజ్ ఏఈగా పి.యశ్వంత్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు ఎంపీడీవో విజయ్ కుమార్‌కు ఉద్యోగ నియామక ఆర్డర్ కాపీని అందజేశారు. ఇటీవల ప్రభుత్వం కొత్తగా పంచాయతీరాజ్ శాఖలో ఏఈల పోస్టులు భర్తీ చేయగా ఆయన ఇక్కడికి వచ్చారు. ఇంతకాలం ఇక్కడ పని చేసిన వంశీకృష్ణ షాద్‌నగర్‌కు ఇటీవల బదిలీ అయ్యారు.

ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఘట్‌కేసర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రామారావు, జగదీష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో 'విజయ'ం

(5వ పేజీ తరువాయి)


ఇక్రిసాట్ అధికారులతో విజయనిర్మల(ఫైల్)

కుమారులు కాగా పెద్ద కుమారుడు రాజవర్ధన్ జిన్‌గుర్తి ఏకలవ్య అగ్రికల్చర్ పాల్‌టెక్నిక్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తుండగా.. చిన్నకుమారుడు మణివర్ధన్ వ్యవసాయ పనులు చేస్తున్నాడు.

అందరికీ ఆదర్శం విజయనిర్మల



సాగులో నూతన ఒరవడులు సృష్టించడంతోపాటు డ్రిప్ ద్వారా కంది సాగు చేస్తున్న మహిళా రైతు విజయనిర్మలను ఇతర మహిళలు ఆదర్శంగా తీసుకోవాలి. వంటింటికే పరిమితం కాకుండా ఉన్న నాలుగెకరాల పొలంలో కొత్తరకం కంది విత్తనాన్ని నమూనా పంటగా సాగుచేసి ఎకరాకు 14 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. అంతర పంటల సాగుతో స్థిరాదాయాన్ని సంపాదిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది. జాతీయ మహిళ దినోత్సవం రోజున ఇక్రిసాట్ రాష్ట్ర వ్యాప్తంగా ఇద్దరు ఉత్తమ మహిళా రైతులను ఎంపిక చేసింది. ఆ ఇద్దరిలో విజయనిర్మల ఒకరు. వ్యవసాయ సాగుకు ఆమె చేస్తున్న శ్రమను, దిగుబడి, లాభాలను చూసి ఇక్రిసాట్ ద్వారా ప్రశంసలు అందుకుంది.

\- డాక్టర్ సుధారాణి, వ్యవసాయ పరిశోధనా స్థానం హెడ్

పొలం పనులంటే ఎంతో ఇష్టం

నాకు చిన్నప్పటి నుంచి వ్యవసాయం, పొలం పనులంటే ఎంతో ఇష్టం. ఉన్న నాలుగు ఎకరాల పొలంలోనే ఆధునిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడి సాధిస్తున్నాం. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి వినియోగంతో కూరగాయలు సాగు చేసుకుంటూ రోజువారీగా విక్రయిస్తూ సంపాదిస్తున్నాము. మాకు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు తగు సూచనలు ఇవ్వడంతోపాటు సేంద్రియ సాంకేతిక సంస్థ పద్ధతిలో సాగు చేస్తున్నాము. 2014లో ఇక్రిసాట్ నుంచి అవార్డు పొందిన తర్వాత మరింత ఉత్సాహంతో సాగు చేస్తున్నాము. మున్ముందు కొత్తరకమైన వంగడాలతో అంతర పంటలు వేసి వ్యవసాయ ఉత్పత్తులను పెంచాలని నిర్ణయించాం. - విజయనిర్మల, మహిళా రైతు



డీసీపీ క్రైం రివ్యూ మీటింగ్


మేడ్చల్ డీసీపీ ఎన్ కోటిరెడ్డి శనివారం నిర్వహించిన క్రైం రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్న ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు

\- హైదరాబాద్ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి)

గ్రూప్-1 అభ్యర్థులకు వైఎస్సార్ ట్రస్టు ఆధ్వర్యంలో వసతి సౌకర్యం

ఘట్‌కేసర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షలు రాసే అభ్యర్థులకు ఘట్‌కేసర్ మండలంలో వసతి, భోజన సౌకర్యాలు కల్పించేందుకు వైఎస్సార్ ట్రస్టు కృషి చేస్తోందని ట్రస్టు వ్యవస్థాపకులు ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం ఘట్‌కేసర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అనాలోచితంగా రాష్ట్రంలో ఎక్కడ బడితే అక్కడ కేంద్రాలు ఏర్పాటు చేశారని ఆరోపించారు. సమాచారం కోసం 9849441789, 6301262064, 9985768758, 9989 891899 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

కొడంగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏలోకి మార్చేందుకు జారీ చేసిన జీవోను వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక మంజునాథ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ముదిరాజ్‌ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ముదిరాజ్‌లకు రూ.5వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్, ముదిరాజ్‌లకు మంత్రి పదవీతో పాటు జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, చైర్మన్ నామినేటేడ్ పదవులను కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు కూరవెంకటయ్య, తిరుపతయ్య, టి.శేఖర్, హనుమంతు, ఆశన్న, వెంకటప్ప, అంబయ్య, నర్సిములు, మదరప్ప, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' నీరు ఆరోగ్యానికి శ్రేయస్కరం

నవాబుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీరు ఆరోగ్యానికి శ్రేయస్కరమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నీటి సరఫరా సహాయకుల శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రత్నప్రసాద్, ఎంపీడీవో అనురాధ, అధికారులు సువర్చల, సాయినాథ్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడొద్దు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడిన తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు తెలిపారు. వెంకటాపూర్ నీలిమ మెడికల్ కళాశాలలో శనివారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ డైరెక్టర్ అఫ్ అడ్మిషన్స్ మహీపతి శ్రీనివాస్ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మేడ్చల్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మండలం గౌడవెల్లి గ్రామ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

24న కొబ్బరికాయల విక్రయానికి వేలం

వికారాబాద్, అక్టోబరు 19: అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి కార్తీకమాస పెద్ద జాతర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 24న కొబ్బరికాయలు అమ్మేందుకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఏవో టి.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో హక్కును దక్కించుకున్న వారు నవంబరు 1 నుంచి 30 వరకు కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు ఇవ్వనున్నట్లు తెలిపారు. 24వ తేదీన మధ్యాహ్నం 1గంటలకు అనంతగిరి ఆలయంలో బహిరంగ హక్కు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. కొబ్బరి కాయలు అమ్ముకొనే హక్కు గురించి డిపాజిట్ లక్ష దీపారాధన సామగ్రి హక్కుకు రూ.10వేలు చెల్లించాలన్నారు. హక్కుపొందని వారికి డిపాజిట్ డబ్బులు వాపస్ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు సకాలంలో హాజరుకావాలన్నారు.

పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

యాలాల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 19: తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని హెచ్‌ఎం మొగులప్ప అన్నారు. అగ్గనూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మొగులప్ప మాట్లాడుతూ పాఠశాల ముగిసి ఇంటికి వెళ్లిన పిల్లలకు మంచి విషయాలతో పాటు అక్షరజ్ఞానం కల్పించాలన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే పిల్లలకు తాము అన్ని విధాలుగా పోత్సాహాన్ని అందిస్తామన్నారు. అనంతరం పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరి, కవిత, అమరావతి, సంజు, శ్రీలత, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో బీజేపీ సభ్యత్వ నమోదు

బొంరాస్‌పేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో అన్ని వర్గాలతో బీజేపీ రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు ఉందని పార్టీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రికార్డు స్థాయిలో 25లక్షలకుపైగానే రాష్ట్రంలో సభ్యత్వ నమోదులు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బంటు రమేశ్, సీహెచ్ నర్సిములు, రవీందర్ నాయక్, జగదీశ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'జల్సా'ను విజయవంతం చేయాలి

కొడంగల్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న కోస్గి పట్టణంలోని మదీనా మస్జీద్‌లో జరిగే జల్సా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఉపసర్పంచ్ ఎస్‌ఎం.గౌసన్ తెలిపారు. కొడంగల్ మక్కా మస్జీద్‌లో శనివారం జల్సా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లా, షేక్ ఆదిల్, ఖలీద్, యూసుఫ్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో ఆశించిన సుడిదోమను నివారించుకోవాలి

ధారూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వరిలో సుడిదోమ నివారణకు తగు చర్యలు తీసుకోవాలని గురుదోట్ల, నాగారం క్లస్టర్ ఏఈవోలు సంజూ రాథోడ్, శిరీషలు రైతులకు సూచించారు. మండలంలోని నాగారంలో సుడి దోమ ఆశించిన వరి పంటను శనివారం పరిశీలించి నివారణ చర్యలను వివరించారు.

జర్నలిస్టు కుటుంబానికి పరామర్శ

కులకచర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సీనియర్ జర్నలిస్టు, ప్రజా టైమ్స్ పత్రిక సంపాదకుడు పోగుల రాములుగౌడ్ మృతి బాధాకరమని కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు, తాండూర్ పట్టణ పారిశ్రామిక వేత్త బుయ్యాన్ని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తిరుమలాపూర్‌లో శనివారం రాములు గౌడ్ అంత్యక్రియల్లో ఆయన పాల్గొని కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, స్థానికులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ పత్రాలు పంపిణీ

దోమ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం మండలంలోని శివారెడ్డిపల్లిలో శనివారం అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదవరెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి షాహీన్‌బేగం, బంగ్లా యాదయ్య, శ్రీకాంత్‌రెడ్డి, సాహెబ్‌ఖాన్, అర్జున్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **మోమిన్‌పేట్:** ఎన్కెపల్లికి చెందిన రైతు దంగేరి నర్సింహులు కావేరి కంపెనీకి చెందిన ఎక్క. 2288 మొక్కజొన్నలో రెండు కంటే ఎక్కువ కంకులు రావడంతో రాజేంద్రనగర్ మొక్కజొన్న పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు.

● **మూడుచింతలపల్లి:** మండలంలోని ఉద్ధమర్రిలో శనివారం మెడిసిటీ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకునేందుకు గ్రామం నుంచి ప్రత్యేకంగా ఉచిత బస్సును మాజీ సర్పంచ్ అనురాధారవీందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

● **మూడుచింతలపల్లి:** ఉద్ధమర్రి గ్రామ పరిధిలో ఉన్న శ్రీ విష్ణుశివాలయంలో శనివారం మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

● **కొడంగల్ రూరల్/తాండూరు రూరల్:** అప్పాయిపల్లికి చెందిన లక్ష్మి అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి గ్రామస్థులు రూ.11వేలా 600 ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా తాండూరు మండలంలోని బిజ్వార్ గ్రామానికి చెందిన కట్ట వెంకటయ్య శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తాండూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు.

● **ధారూరు:** దీపావళి పండుగను పురస్కరించుకుని ఆల్ ఇండియా మర్వాడీ యువ మంచ్ తాండూర్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ధారూరు కేజీబీవీలోని విద్యార్థినులకు మిఠాయిలను పంపిణీ చేశారు. జిల్లాలోని 6 పాఠశాలలు, 4 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 450మంది పిల్లలకు మిఠాయిలను పంపిణీ చేశామని ఆయన తెలిపారు.

● **బొంరాస్‌పేట్:** కొడంగల్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన గోపాలమిత్రలు శనివారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సన్మాన సభకు బయలుదేరి వెళ్లారు.

● **తాండూరు రూరల్:** వ్యవసాయా శాఖ ఏవో, ఏఈవోలు పంటలను పరిశీలించాలని వ్యవసాయ శాఖ తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నాలుగు మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు అందుబాటులో ఉంటూ టోకెన్లు ఇవ్వాలని సూచించారు. కర్ణాటక నుంచి పత్తి దిగుమతి కాకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు.

● **బొంరాస్‌పేట్:** దుద్యాల మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో విజయరామారావు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇటీవలే డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు విధి నిర్వహణ, పాఠశాలలో జరిగే వివిధ రకాల కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ రాందాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.